డబ్బు సంపాదించాలన్న కోరిక మత్తు లాంటిది. అప్పుడు ఊహించుకున్నవి తప్పు వున్న విలువలు కన్పించవు. ఆ మత్తు తొలగి కొత్త చూపు కుదిరితే... జీవితమూ అందులో అనుభవమూ అంతా కొత్తే!

**“తాగుడు చాలా హానికరం. అది గుండెకూ, జీర్ణకోశానికీ, నాడీ వ్యవస్థకూ ఎంతో అపకారం చేస్తుంది.”**

గొప్ప శాస్త్రజ్ఞుడు తన పరిశోధనా ఫలితాలను వెల్లడించినట్లు చెబుతుంటే పేషెంటు కళ్ళల్లో లీలామాత్రంగా కదిలే భయాందోళనలు సరిగ్గా ఈ సమయంలోనే గుర్తుకొస్తాయి నాకు. కొద్దిగా నవ్వులాంటి భావం కూడా వస్తుంది వాళ్ళ భయం చూసి. నేను చెప్పేది నిజమే. ఈ మాటలు రోజూ ఎంతోమందికి చెబుతుంటాను. అయినా రాత్రి తొమ్మిదీ పదీ అయ్యేటప్పటికి, కనీసం హాఫ్ బాటిల్ స్కాచ్ విస్కీ అయినా నిద్రాదేవతకి నైవేద్యం పెట్టకపోతే నన్ను కరుణించదు.... మళ్ళీ ఇది కూడా పూర్తిగా నిజం కాదు. కేవలం నిద్రకోసమే అయితే విస్కీయే అక్కర్లేదు.... మరెందుకు?

సమాధానం నాకు తెలుసు. దానికి ఒక స్పష్టమైన రూపం లేకపోయినా నేను పూర్తిగా యెరుగుదును, నేనెందుకు తాగుతానో.


ఆల్కహాల్ కలిగించే మత్తులో చేసుకోగలుగుతున్న ఒకరకం ఆత్మవంచనకోసం అయ్యుండాలి.

అయితే ఈ రోజుకూడా నా అలవాటును మించి తాగాను. అయినా సరిపోనట్టే అనిపిస్తోంది. గత యిరవై రోజులుగా కూడా యింతే. దాదాపు ఒక ఫుల్ బాటిల్ ఖాళీ అయితేనేగాని తృప్తిగా వుండటం లేదు. ఆలోచనల తీవ్రత అంతలా వుంటోంది. ఒక నిండు సీసాను యెదిరించి చిత్తుచేయగల ఆలోచన. ఒకోసారి చిరాకనిపిస్తోంది. ఓడిపోయినట్టుగాకూడా అనిపిస్తోంది.

లేకపోతే నేను ఆలోచించడమేమిటి.... పుట్టి బుద్ధెరిగిన తరువాత ఏదైనా క్లిష్టమైన కేసు విషయంలో మినహాయిస్తే అసలు ఇంత సీరియస్‌గా జీవితం గురించి ఆలోచించవలసిన అవసరమే రాలేదు. ఇలాంటి సందర్భమొకటి వస్తుందని నేనెప్పుడూ అనుకోలేదు కూడాను.

దీనికంతటికీ కారణం.... ఆ కిష్టిగాడు. ఆ రాళ్ళు బద్దలుకొట్టే కూలీవెధవ. నా హృదయంమీద ఎక్కడో కొట్టేశాడు. అదే నాకు ఆశ్చర్యంగా వుంది. అంత చిన్న మనిషి పేరుకూడా నాకు గుర్తుండడమే చాలా ఆశ్చర్యం.... గుర్తుండటమేమిటి, ఈ యిరవై రోజుల్లోనూ యెప్పుడూ వాణ్ణి నేను మర్చిపోలేదు. ఒక విధంగా చెప్పాలంటే ఆ వెధవ పెద్ద విలన్‌లా నా బుర్రలో తిష్టవేసుకూర్చున్నాడు. వాడి ఆర్గ్యుమెంటులో కొన్ని పాయింట్సు నన్ను సూదుల్లాగ పొడుస్తున్నాయి. ఎన్ని మాటలన్నాడు ఇడియెట్.

అయినా వాడు నన్నేం అన్నాడు? నేనసలు పనిగట్టుకొని వాడిదగ్గరకెళ్ళి అడిగి వుండకపోతే, వాడికా అవకాశమే లేదు. నిజానికి వాడి అభిప్రాయం వాడు చెప్పాడు. అందులో కొన్ని సూటిగా, వాడి బాణాల్లా నా హృదయంలో దిగబడిపోతాయని వాడికీ తెలిసుండదు.




విస్కీ వాసన ఘాటును కూడా పక్కకు నెట్టి దూసుకొచ్చిన అలవాటైన సెంటు పరిమళం.. తల పక్కకు తిప్పి చూశాను.. రేణుక.... నా భార్య.... ఒక చెయ్యి నా భుజం మీద వేసి కొద్దిగా నవ్వుతోంది. ప్రౌఢ వయస్సు దాటి పోతున్నా పెదవుల మీద నవ్వూ, ఒంటి మీద బిగీ, యవ్వన ఛాయలు, వదిలిపెట్టిపోలేదు.

ఒకసారి కిందినించి పైదాకా చూశాను. నా కళ్లు బరువుగా, ఒళ్ళంతా తిమ్మిరిగా, ఆరాటంగా వుంది.... బాల్కనీలోకి పడుతున్న వెన్నెల వెలుగులో గొప్ప సెక్సీగా కనిపిస్తోంది రేణుక. ఆమె నడుం చుట్టూ చేతులు వేశాను. నా శరీరంలో ఏదో కోరిక ఒళ్ళు విరుచుకోడానికి ప్రయత్నం చేస్తోంది.

రేణుక నవ్వింది. సమ్మోహనంగా వుందా నవ్వు.

“ఊఁ.... ఏమిటీ...యివాళ మరీ కోటా దాటిపోయినట్టుంది....?”

లాలనగా నా జుట్టులో వేళ్ళు జొనిపి నా తలను తనకు ఆనించుకొంది. ఒక్కసారిగా దుఃఖం వొచ్చినట్లయింది. ఆ గొంతులో లాలన యింతకుముందు నా మీద ఏ ప్రభావం చూపించేది కాదు. నిరాసక్తంగా వుండేది. కాని యిప్పుడు ఆ లాలన నన్నేదో ప్రశ్నిస్తోంది.

"రండి .... నిద్రపోదాం!" రేణుక గొంతులో లాలన, ఆప్యాయత భరించ లేకపోతున్నాను.

"ఒరే....కిష్టిగా!" కసిగా మనసులోనే తిట్టుకున్నాను.

వాడి మాటలు చెవుల్లో గింగురుమంటు న్నాయి.

"అది కాదు డాక్టరు బాబూ! మాలాంటి డబ్బులేనోళ్ళకి ప్రేమా, దోమా అలాంటి యేయీ వుండవు బాబూ .... పెళ్ళాం మీద వున్నదంతా నిజంగా చెప్పాలంటే బాబయ్యా.... కామం.... ఒకోసారి బాబయ్యా, మందు గట్టిగా కొట్టేసినప్పుడు పిచ్చి కసెత్తిపోతాదనుకోండి.. అప్పుడు మాత్రం బాబయ్యా .... ఏవే పెళ్ళాం నిన్ను పేమించేత్తన్నానే, నువు లేపోతే బతకలేనే అని తెగసెప్పేత్తానండి కబుర్లు. అంతేగాని, మాకు పేవేటండి! అయ్యన్నీ మీలాంటి డబ్బునోళ్ళరికే."

రేణుక చుట్టూవున్న నా చేతులు అప్రయత్నంగా బిగిసడలి జారిపోయాయి. తల పైకెత్తి రేణుక వంక చూశాను. ఆశ్చర్యంగా చూస్తోంది నా వంక... "నువ్వెళ్ళి పడుకో రేణూ! నేను తరవాత వస్తాను."

నా మాటలు నాకే ముద్దగా బరువుగా వినిపించాయి. రేణుక నా వంక అదోలా చూసి వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది గదిలోకి.... బాటిల్‌లో మిగిలిన విస్కీ మొత్తం గ్లాసులో వొంపేసుకుని రెండు గుక్కల్లో తాగేశాను. నెమ్మదిగా సిగరెట్ వెలిగించుకొని రెండు దమ్ములు గుండె నిండా పీల్చి వదిలాను. కాస్త హాయిగా వున్నట్టనిపించింది.... కాసేపలాగే కూర్చున్నాను. డోసు బాగా ఎక్కువైనట్టుంది. వికారంగా అన్పిస్తోంది.

# చికిత్స

## బి.సత్యమూర్తి




నెమ్మదిగా లేచి బెడ్‌రూమ్‌లోకి నడిచాను....కిష్టిగాడి మాటలు జ్ఞప్తికి వచ్చి ముడుచుకుపోయిన కోరిక, మళ్ళీ మెలికలు విప్పుకొంటోంది.... 'నో ....నో ....' ఆ వెధవ మాటలు నేను కేర్ చేయకూడదు- దృఢంగా నిర్ణయించుకొంటూ మంచం దగ్గరకు నడిచాను .... అప్పుడే నిద్ర కుపక్రమిస్తోన్న రేణుక నన్ను చూసి నవ్వింది.... బెడ్‌రూమ్ లైటు మందమైన వెలుగులో ఇంకా అందంగా కన్పిస్తోంది రేణుక.... ఆమె పక్కన పడుకొని కౌగలించుకున్నాను. నన్ను ఆప్యాయంగా పొదువుకొన్నాయి ఆమె చేతులు....


నాలుగయిదు నిముషాల తరవాత, వివస్త్రగా ఆమె నా చేతుల్లో మెలికలు తిరుగుతోంటే.... ఆ ఒంటి మనుపూ. ఆకారం అద్భుతమనిపించి, మరో ఫుల్ బాటిల్ తాగినంత ఆనందం....

"ఓహ్....డియర్....యువార్ బ్యూటిఫుల్....ఐ లవ్ యూ వెరీమచ్!"

గాఢంగా ఆమెను కౌగలించుకొంటుంటే, చెవిలో కిష్టిగాడి మాటలు.... వాడి నవ్వు.

"బాగా అలవాటైపోయిన ఒళ్ళు బాబయ్యా. చూసి చూసి యింక వేడి పుట్టదు బాబు, అందుకే కాస్తంత మందు తగిలించి పరసానికి దిగిపోతే యింక పర్లేదు బాబూ...."

"నో .... నో ...." మనసులోనే అరిచాను....




రేణుక పెదవులందుకుంటూ.... .... ఆ మత్తులో కూరుకుపోడానికి ప్రయత్నిస్తూ.. వాడు చెప్పింది నిజం.... విస్కీలేకుండా అయితే రేణుకనాకుఅందంగా కనిపించదు.

ఇక అలోచించబుద్ధి కాలేదు.

* * *

ఈ చుట్టుపక్కల పాతిక పల్లెటూళ్ళకు నేనే డాక్టర్ని. నేను వుంటున్న వూరుకూడా

సినీ తారలు
శ్రీదేవి, సుజాత, జయసుధ, జయప్రదల ఫోటోల సెట్టు 5 రూ. ఏయన్నార్, ఎన్టీఆర్, శోభన్‌బాబు, కృష్ణ, కృష్ణంరాజుల ఫోటోల సెట్టు 6 రూ. తెలుగు, హిందీ తారల అడ్రసులు (ఫోను నంబర్లతో సహా) గల పుస్తకం 2 రూ. ఎం.ఓ. చేయండి!
SUVARNA
వై.కె.మూర్తి
దాసరివారివీధి, విజయవాడ-2

దీర్ఘ వ్యాధులకు ఉత్తమ వైద్యం
దురభ్యాసములకు లోనై, దాంపత్యసౌఖ్యం పొందలేనివార్కి హెర్నియా, చర్మవ్యాధులకు పోస్టుద్వారా వరిబీజం (బుడ్డ) ఇస్నోఫిలియా, ఉబ్బసం (దమ్ము) జీర్ణాశయ (గ్యాస్ట్రిక్) మూత్ర, స్త్రీల వ్యాధులకు ఆపరేషన్ లేకుండా చికిత్స చేయబడును. -రండి
డా॥ దేవర
5/1 బ్రాడీపేట, గుంటూరు. A.P.

పెద్ద టవునుకాదు, చిన్న పల్లెటూరూ కాదు. దాదాపు పదిహేను సంవత్సరాలనుంచి ప్రైవేటు ప్రాక్టీసు చేస్తున్నాను. పెద్ద పెద్ద భూస్వాముల ఖాతాలన్నీ నావే. ఈ పదిహేను సంవత్సరాల్లోనూ పేరు ప్రతిష్టలూ, డబ్బూకూడా చాలా ఎక్కువ సంపాదించాను. నేను చేపట్టిన కేసులు నూటికి తొంభైతొమ్మిది విజయవంతమవడం నా పేరు ప్రతిష్ఠలకు కారణమైతే, డబ్బు ఎక్కువ సంపాదించడానికి కారణం మాత్రం నా నిర్మొహమాటమేనని చెప్పాలి. రోగంతో బాధపడుతున్నప్పుడు వైద్యుడు భగవంతుడిలాగానూ, రోగం తగ్గుతున్నప్పుడు స్నేహితుడిలాగానూ; తగ్గిపోయింతర్వాత బిల్లు చెల్లించే సమయానికి శత్రువులాగానూ కనిపిస్తాడన్న సూక్తిని నేను అక్షరాలా నమ్ముతాను. డబ్బు విషయంలో పేషెంటుపట్ల సానుభూతి చూపించే విధానంమీద బొత్తిగా నమ్మకం లేదు నాకు. చాలా నిర్మొహమాటంగా ఖచ్చితంగా డబ్బు వసూలు చేస్తాను. ఈ విషయంలో నా కాంపౌండరు సుబ్బరాజు నా కుడి భుజంగా వ్యవహరిస్తాడు. ఈ డబ్బు విషయంలో గొడవలూ, చిక్కులూ పెద్ద పెద్దవాళ్ళ దగ్గర్నుంచి ఎప్పుడూ ఎదురుకావు. వచ్చిన చిక్కంతా చిన్న చిన్నవాళ్ళ దగ్గర్నుంచే. కూటికి గతిలేకపోయినా రోగాల విషయంలో మాత్రం చాలా స్థితిమంతులుగా వుంటారు వాళ్లు. డబ్బు వ్యవహారంలో ముఖ్య పరిష్కర్త సుబ్బరాజు.... ఈ పదిహేనేళ్ళనుంచీ నాకు ఏ చిక్కులూ ఎదురుకాలేదు. కాకపోతే ఇరవైరోజులక్రితం ఓ సంఘటన జరిగింది :

నా మేడా, హాస్పిటలూ ఒకే కాంపౌండులో వుంటాయి, ఎమర్జన్సీ కేసులు తరచూ చూడ్డానికి వీలుగా. ఈ విధంగా నా హాస్పిటల్‌నుఅభివృద్ధి చేసుకొన్నాను. స్టాఫుకూడా రెండు క్వార్టర్స్ కట్టించాను. దీనివల్ల నేను యిరవై నాలుగ్గంటలూ ఏ నిమిషంలోనైనా వాళ్ళ సర్వీసును వుపయోగించుకోవచ్చని నా అభిప్రాయం. వాళ్ళు మాత్రం నేనిచ్చిన క్వార్టర్స్ చూసుకొని మురిసిపోయే స్థాయిని దాటి యివతలకు రాకపోవడం నాకు గొప్ప ఆనందంగా వుంటుంది.

ఆ రోజు తెల్లవారుఝామున సుబ్బరాజు వచ్చి లేపాడు. ఎమర్జన్సీకేసు.... పురిటికేసు. జగన్నాథరావుగారుకూడా వచ్చారనగానే గబగబా లేచి వెళ్ళాను. జగన్నాథరావుగారు పేరుమోసిన క్వారీ కంట్రాక్టరు. వాళ్ళ క్వారీలో పనిచేసే కిష్టిగాడు అనబడే కూలీ భార్య ప్రసవవేదన పడుతోంది. పరీక్షించి చూశాను. సహజంగా ప్రసవించే అవకాశం ఎంతమాత్రం లేదు. సిజేరియన్ చేసి బిడ్డను బయటకు తియ్యాలి. సిజేరియన్ అంటే దాదాపు ఆరువందలువరకూ చార్జి చేస్తాను. ఈ విషయం నా అలవాటు ప్రకారం నిర్మొహమాటంగా జగన్నాథరావుగారికి తెలియజేశాడు సుబ్బరాజు. ఆయన కాదనరని నాకు తెలుసు. సహజంగానే ఆయన దానికి అంగీకరించారు.

ఆపరేషన్‌కు అన్నీ సిద్ధం చేస్తుండగా కన్సల్టింగ్ రూమ్‌లోకి దూసుకొచ్చాడు ఓ పాతికేళ్ళ యువకుడు. అంతకుముందే చెప్పిందాన్నిబట్టి వాడే కిష్టిగాడనీ, ఆ అమ్మాయి వాడి భార్యఅనీ నాకు తెలుసు.

నేనూ, జగన్నాథరావుగారుకూడా.... వులిక్కిపడి చూశాం.

"నువ్వెందుకొచ్చావురా?.... నేను డాక్టరుగారితో అన్నీ మాట్లాడతాను. వెళ్ళి బయట కూర్చో...." మందలిస్తున్నట్టు అన్నారు జగన్నాథరావుగారు. వాడు అదోలా నవ్వాడు. వాడి నవ్వు చూసి ఆశ్చర్యమేసింది నాకు. వాడు కదిలే ప్రయత్నమేమీ చెయ్యకపోగా, మరో రెండడుగులు ముందుకువేశాడు. గుప్పున నాటుసారా వాసన దూసు కొచ్చింది.

"ఏం మాట్లాడేరు బాబయ్యా.... ఆరొందలిత్తానని!"

వాడి గొంతులో వెటకారానికి నేనూ, జగన్నాధరావుగారూకూడా వులిక్కిపడ్డాం. జగన్నాధరావుగారు నెమ్మదిగా తలవూపారు. కిష్టిగాడు గట్టిగా నవ్వాడు.

"వద్దుబాబూ.... ఆరొందలు మీరిచ్చేత్తే తరవాత నేనెలా తీర్చగలను సెప్పండి....

నేనూ, నాకు పుట్టేదో, పుట్టేవాడో, ఇద్దరూ కూడా మీ దగ్గర చచ్చేదాకా పన్జేసినా అప్పు తీరవద్దా....!"

"మరయితే...." జగన్నాథరావుగారికి కోపం వచ్చినట్టుంది. నాకుకూడా చిరాకేస్తోంది, వాడి మాటలూ, వాలకం చూస్తుంటే.

"కోపగించుకోకండి బాబూ! అంత డబ్బు నేనిచ్చుకోలేను. ఒక రెండొందలయితే ఆపరేసను చేసెయ్యమనండి." అన్నాడు వాడు.

"రెండొందలకు ఆపరేషన్ అవదు!" చాలా కఠినంగా వాడిమీద నాకొచ్చిన కోపమంతా కలిపి అన్నాను. వాడు ఏం తొణకలేదు సరికదా వెంటనే అన్నాడు: "అయితే మానేయండి బాబూ.... ఆరొందలెట్టి దాన్ని బతికించుకొని, మరో మూణ్నెల్లో, నాల్నెల్లో దాన్ని పోషించడానికి నేనేం డబ్బులున్నోణ్నికాదు."

"ఆపరేషన్ చెయ్యకపోతే అది ఛస్తుందిరా వెధవా!" కోపంగా అరిచినట్టు అన్నారు జగన్నాథరావుగారు.

"పోనివ్వండి బాబూ. అది సత్తే కొత్త పెళ్ళాం ఇంకోటొత్తది. ఆరొందలెట్టి ఈ డొక్కు ముండని బతికించుకోడం కంటే, రెండొందలెడితే బాబూ యింకో కొత్త గుంటని తెచ్చుకోవచ్చు.... ఏమంటారు!"

"నో ర్మ్ యూ!" జగన్నాథరావుగారు అరిచారు. "నీ ఇష్టమొచ్చినట్టు తగలడు" నేను కోపంగా లేచి నిలబడ్డాను.

నా ఈ పదిహేనేళ్ళ సర్వీసులోనూ ఇలాంటివాడెప్పుడూ నాకు తగల్లేదు. డబ్బు ఎక్కువ చెబితే, కాళ్ళా వేళ్ళాపడి వందో రెండొందలో తగ్గించమన్నవాళ్ళున్నారు గానీ....ఇలా ప్రాణాల్ని తృణప్రాయంగా మాట్లాడినవాళ్ళు లేరు. ఆ అమ్మాయికి ఆపరేషన్ చెయ్యకపోతే, మరో రెండు మూడు గంటల్లో తప్పకుండా ఛస్తుంది.... పోనీ కనీసం వాడు బతిమిలాడినా ఆపరేషను చేసేద్దును.... నేనుగా రాజీకివచ్చి ఆపరేషను చెయ్యడానికి నా అహంకారం అంగీకరించడంలేదు.... వాడు మొండి వెధవ. నాకంటే అహంకారిలా వున్నాడు. మా కళ్ళెదురుగానే అలా నరకయాతన అనుభవిస్తున్న అమ్మాయిని రిక్షాలో వేసుకొని తీసుకెళ్ళిపోయాడు.

జగన్నాథరావుగారు క్షమాపణలు చెప్పుకొని వెళ్ళిపోయారు. నేను కోపంగాలోపలికొచ్చి పడుకొన్నాను.

ఆ రోజు ఇంకా నాకు నిద్ర పట్టలేదు.. సాయంత్రానికి సుబ్బరాజు కబురు చెప్పాడు. ఆ అమ్మాయి నా అంచనా ప్రకారమే చనిపోయింది.

అదిగో....సరిగ్గా, ఆ క్షణం మొదలు.. నేను తప్పు చేశానేమో అన్న సందేహం.... చికిత్స జరక్కపోతే ఆ అమ్మాయి ప్రాణాలు దక్కవన్న విషయం తెలిసుండికూడా నేనెందుకంత మూర్ఖంగా ప్రవర్తించాను. నిజానికి ఆపరేషను వుచితంగా చేసినా నాకు పెద్ద నష్టమేం రాదు. కాని, వాడు ఆ కిష్టిగాడి అహంకారం వల్లనే యిలా జరిగింది.

ఇలా ఎంత సరిపెట్టుకున్నా మనసులో ఓ మూల ఏదో పీకుతూనే వుంది. కాని వుచితంగా చికిత్స మొదలుపెడితే డాక్టరుగా నేను లోకువై పోతాను. అక్కణ్ణించి ప్రతీ అడ్డమైనవాడూ కాళ్ళకడ్డంపడిపోయి వట్టిచేతులు చూపించి చిప్ప చేతికిస్తారు చివరికి.

కాని....

ఒక ప్రశ్న నన్ను వెంటాడ్డం మానలేదు....ఆ అమ్మాయి మరణానికి కారణం నేనా? కిష్టిగాడా? .... నాకు మనశ్శాంతి లేకుండాపోయింది ఈ ప్రశ్నకు సమాధానం దొరక్క.


మీ కేశ సౌందర్యాభివృద్ధికి కొబ్బరినూనె కంటె అతి ఉత్తమమైనదేది?

కేశవర్ధినిని

చేర్చిన కొబ్బరినూనె

OBM 6119/TG




ఔను! మీరు ప్రతి నిత్యమూ తలకు రాసుకుంటూన్న కొబ్బరినూనెలో కొన్ని చుక్కలు కేశవర్ధినిని కలపండి. తల చర్మానికి అంటేటట్టుగా తలకు రాసుకోండి. ఇదే అందంగా తల వెంట్రుకలు పెరగడానికి సాంప్రదాయిక రహస్యము- కేశవర్ధిని. వెంటనే ఒక బాటిల్ కేశవర్ధినిని కొని వాడండి.




కేశవర్ధిని ప్రోడక్ట్స్
మద్రాసు-600 087

# HORSLEY HILLS SCHOOL

**HORSLEY HILLS P.O CHITTOOR Dist (A.P.)**

English Medium Residential offers admission for boys and girls into Class I to VI for the academic year 1981-82. The School is Affiliated to the Council for the Indian School Certificate Examination New Delhi.

For particulars please write to

MR. JUSTIN ANTONY M. Sc., B.Ed.

PRINCIPAL



**B. A.. & B. Com., ఎంట్రన్స్ పరీక్షలకు**

**"లక్ష్మి గైడ్స్"**

చదవండి

**Andhara University Open University System**

1. English Guide According to Latest Model with Non-Detailed — Rs. 12-00
2. Scarlet Pimpernel Guide — Rs. 3-00
3. Telugu Guide — Rs. 12-00
4. Telugu Non-Detailed Guide — Rs. 3-00
5. Indian History Guide (Telugu Medium) — Rs. 7-00
6. Politics Guide ( „ ) — Rs. 10-00
7. Public Administration ( „ ) — Rs. 6-75
8. Commerce 1 & 2 Combind ( „ ) — Rs. 13-50

ఇంగ్లీషు మీడియంలో గూడా లభించును

మీ ప్రాంతీయ బుక్‌షాపులో సంప్రదించండి లేదా

వివరములకు మాకు వ్రాయండి

**M/s. GUPTA BROTHERS**

Main Road :: Visakhapatnam-530001

GANESH



# Sri Rama B.Ed / M.Ed Coaching Institute

**NELLORE**

(Branch : KURNOOL)

Principal : B. Ramasubbaiah
(Retired Lecturer, Govt. College of Education)

1. 3rd Batch of B.Ed from this institute and 2nd batch for M.Ed.
2. All graduates are eligible as in last year for B.Ed All B.Eds are eligible for M. Ed.
3. Contact programmes and Exams at Nellore.
4. Personal and postal coaching.

Contact **V. V. Sarma** M. A., M.Ed,
B/B 353 B. Camp, **Kurnool**

if You wish to join at Kurnool. Apply for prospectus paying Rs. 2/-


చివరికి ఒక సమాధానం తయారుచేసుకున్నాను....దీనికంతటికీ కారణం ఆ కిష్టిగాడే....వాడికసలు భార్యమీద ఏమాత్రం ప్రేమలేదు. దానిమీద వాడికి కొంచెం అనురాగమన్నావుంటే, వాడు నా కాళ్ళు పట్టుకొని ఎలాగైనాసరే బ్రతికించమని దేవుళ్లాడేవాడు.

ఈ సమాధానం నాకొంత సంతృప్తి నిచ్చిందికాని, దీనికి నిర్ధారణ కావాలి. వాడికి భార్యమీద ప్రేమ లేదన్న విషయం నిర్ధారణ అయితే నాకు చాలా శాంతిగా వుంటుం దనిపించింది.

అందుకే ఒకరోజు రాత్రి సుబ్బరాజును తీసుకొని కారు మీద వాళ్ళ గూడెం వైపు వెళ్ళాను. గూడెం చివర కారాపి వాణ్ణి పిలుచుకొచ్చాడు సుబ్బారాజు. ఆశ్చర్యపడుతూ వచ్చాడు కిష్టిగాడు. వాణ్ణిచూసి నాకూ ఆశ్చర్య మనిపించింది. అంతకు ముందు చూసిందానికంటే యిప్పుడు వాడు నీట్‌గా వున్నాడు.

కారు బాక్‌డోర్ తెరిచి లోపల కూర్చోమన్నాను. వాడు నాకు నమస్కారం చేశాడు. కూర్చోడానికి తటపటాయిస్తుంటే బలవంతంగా కూర్చోబెట్టాను. సారావాసన గుప్పుగుప్పుమంటోంది. సుబ్బరాజు అర్థం చేసుకోగలడు. అందుకే దూరంగా పోయి నిలబడ్డాడు.

నెమ్మదిగా వాణ్ణి ప్రశ్నించడం మొదలుపెట్టాను. వాడి దగ్గర్నించి ఒకో సమాధానం వింటుంటే నాకు తల తిరిగిపోవడం ప్రారంభించింది. నా హృదయంలోవున్న వీక్ కార్నర్స్ అన్నిటి మీదా ఒకో దెబ్బ వేశాడు వాడు.

"మీరేం అనుకోకుంటే డాక్టర్ బాబూ. మీ తప్పేంలేదండి. జగన్నాథం బాబుగారి బాకీ నేనెలా తీర్సగలను సెప్పండి. అయినా బాబూ! అది డొక్కుముండై పోయిందండి. దాని మీద నాకు కోరి కూడా లేదండి." .... చాలా నిస్సంకోచంగా బీడీ వెలిగించుకొని, దమ్ములాగి వదిలాడు.

"అయినా బాబూ, రెండొందలు మా గూడిపోళ్ళకి కడితే చాలండి కొత్త పెళ్లమొచ్చేద్దండి నాకు .... అందుకే బాబయ్యా, మళ్ళీ ఇంకోదాన్ని కట్టేసుకున్నానండి.... ఇయ్యాల్టికి మూడోరోజు బాబూ...."

నాకు ఆశ్చర్యంగా వుంది వాడిమాటలు వింటూంటే. అయినా తరవాత తరవాత వాడి సమాధానాలు, అందులో వెటకారం, నన్ను నలిపి నలిపి వదులుతున్నాయి.

"ఏంటో బాబూ! యదవ యవ్వనం, లేనోళ్ళకూడా వచ్చేద్దికదూ బాబూ, అలాగే నాకూ వచ్చేసిందండి. పట్టుకు ప

# వేసవి పానీయాలు

## చాకొలెట్ సిరప్

కావలసిన వస్తువులు : కోకో 1 కప్పు. పంచదార 2 కప్పులు. చల్లని నీరు 2 కప్పులు. వెనీలా ఎసెన్సు 1 చెంచా. ఉప్పు చిటికెడు.

తయారుచేయు విధానం : కోకో, పంచదార, ఉప్పు బాగాకలిపి కొంచెం కొంచెం చల్లని నీరుతో కలపాలి. సన్నని సెగమీద వుంచి చిక్కబడేవరకు కలుపుతూ వుండాలి చల్లారినతర్వాత వెనీలా ఎసెన్సు కలిపి సీసాలలో భద్రపరచాలి.

## పైన్‌ఏపిల్ లైమ్‌ఫ్రాస్ట్

కావలసిన వస్తువులు : కోడిగుడ్లు 3. పంచదార 4 చెంచాలు. నిమ్మరసం 1 చెంచా. అనాసరసం 4 కప్పులు.


తయారుచేయు విధానం : కోడిగుడ్లు కొట్టి పచ్చసొన వేరుచేసి. తెల్లసొన బాగా చిలక్కొట్టాలి. పంచదార మెత్తగా పొడి చేసి. నిమ్మ. అనాసరసం. పంచదార, కోడిగుడ్లసొన బాగా కలిపి ఫ్రిజ్‌లో వుంచాలి.

## కమలా జామ్

కావలసిన వస్తువులు : కమలారసం- 2 కప్పులు, పంచదార- 2 కప్పులు, నీళ్లు- 2కప్పులు. సిట్రిక్ యాసిడ్- ½ టీస్పూను. సోడియం మెటా బైసల్ఫేట్- ½ టీస్పూను.

తయారుచేయు విధానం : కమలారసం, పంచదార, నీళ్ళు సమానమైన పాళ్ళలో వుండాలి. మొదట కమలా పండ్లను వలిచి ఫ్రూట్ క్రషర్‌తోనైనా. చేతితోనయినా రసం పిండుకొని ఒక శుభ్రమైన బట్టలో వడకట్టాలి. సరిగ్గా రెండు కప్పుల రసం వుండాలి. ఒక కప్పు నీళ్ళల్లో పంచదారను సిట్రిక్ యాసిడ్‌నువేసి పొయ్యిమీదఉంచి, బాగా మరిగిన తర్వాత దింపి చల్లారనివ్వాలి. ఇంకొక కప్పు వేడి నీళ్ళలో సోడియం మెటా బైసల్ఫేట్ కలిపి వడగట్టిన కమలారసంను. చల్లారనిచ్చిన పంచదార నీళ్ళను కలుపుకొని. బాగా చల్లారిన తర్వాత మూతి సన్నముగా వుండే సీసాలో పోసి మూత గట్టిగా బిగించాలి. మనకు కావలసినప్పుడు ఒక గ్లాసుడు నీళ్ళకు 2 టీ స్పూనులు వేసుకుంటే సరిపోతుంది.

— పి. సుగుణ, ఖమ్మం




రూపాయల చొప్పున నెలకు నలభై రూపాయలు బజారు ముండలకి తగలబెట్టేకంటే. రెండొంద లెట్టి ఓ గుంటని కట్టేసుకుంటే పోద్దని బాబయ్యా దాన్ని చేసుకున్నాను. అదీ అలాగయ్యిందండి. ఇప్పుడు చేసుకున్నది కాత బాగానే వుందిలెండి."

నేను మాట్టాడలేదు. వాడు చెప్పుకుపోతున్నాడు.

"అది కాదు డాట్లరు బాబూ, మాలాంటి డబ్బులేనోళ్ళకి ప్రేమ, దోమ, అలాంటి. య్యేయీ వుండవుబాబూ. పెళ్ళాంమీద వున్నదంతా నిజంగా సెప్పాలంటే బాబయ్యా..... .... కామం .... ఒకోసారి బాబయ్యా. మందుగట్టిగా కొట్టేసి నప్పుడు పిచ్చి కసెత్తిపోతా దనుకోండి....అప్పుడు మాత్రం బాబయ్యా .... ఏవేఁ పెళ్ళవాఁ, నిన్ను పేమించేత్తన్నానే, నువు లేపోతే బతకిలేనే అని తెగసెప్పేత్తా నండి కబుర్లు ....అంతేగాని, మాకు ఏవిఁటండీ, అయ్యన్నీ మీలాంటి డబ్బునోళ్ళరికే..!"

సరిగ్గా ఇక్కడే నా గుండెలు బద్దలు కొట్టాడు వాడు. రేణుక మీద నా అభిప్రాయమేమిటో అదే చెబుతున్నాడు వాడు. ఇన్నాళ్ళ దాంపత్యంలో ఏ ప్రశ్న ను రాకుండా విస్కీపోసి జోకొడుతున్నానో అదే చెబుతున్నాడు వాడు.

ఆ తరువాత మరో అరగంటకు వాడిని వదిలి వచ్చేశాను. కాని వాడు నన్ను వదలటంలేదు.

* * *

తల విదిలించి చూశాను. రాత్రి రెండు గంటలు దాటింది. ఈ నలుగుడునుంచి తప్పించుకోడానికి నా కో పరిష్కారం దొరికినట్టయింది. తరవాత తరవాత ఆలోచిస్తే అది చాలా మంచి పరిష్కారంలా కూడా అనిపించింది....ఆ తరవాత చాలా శాంతంగా, తేలిగ్గా, ఉత్సాహంగా వున్నట్టనిపించింది. చాలాకాలం క్రితం నాలో ఎక్కడో అట్టడుగునపడి క్రమ్మగిపోతున్న ఒక భావం పైకిలేచి మనసంతా ఆక్రమించుకుంది.

విస్కీమత్తు పూర్తిగా దిగిపోయి వొళ్ళంతా తేలిగ్గా అనిపిస్తోంది. రేణుక వంక చూశాను. ప్రశాంతంగా నిద్రపోతోంది. చాలాకాలం తరవాత విస్కీ మత్తు పొర లేకుండాకూడా రేణుక అందంగా, హుందాగా కనిపిస్తోంది. గబగబా రేణుకను లేపాను. కళ్ళుతెరిచి నవ్వి, ఎందుకన్నట్టు చూసింది.

"రేణూ....లే....లేచి, కాసేపు కబుర్లు చెప్పు ...." నా గొంతు నా కే కొత్తగా, ఆనందంగా వినబడుతోంది.

నావంక ఆశ్చర్యంగా, ఆర్ద్రంగాచూసి చప్పున నన్ను కౌగలించుకొంది రేణుక.. చాలా హాయిగా వుంది ఆమె కౌగిలి.... ఏదో అనబోయేంతలో బయట కాలింగ్ బెల్ మోగిన చప్పుడు....రేణుకను వదిలి, మంచం దిగి, తలుపు తెరిచాను.... ఎదురుగా సుబ్బరాజు?

"అర్జెంటు కేసు సార్ ! డయేరియా!"

"ఎవరు ?" అడిగాను.

"ఏమో సార్ !.... చిన్నవాళ్ళే ...."

"ఉహూఁ.... పద, వస్తాను...."

వెనక్కి తిరిగి రెండడుగులు వేసింతర్వాత ఓ విషయం గుర్తుకొచ్చి చప్పున, వెళ్ళిపోతున్న సుబ్బరాజును పిలిచాను. గబగబా వెనక్కి వచ్చాడు.

"నువ్వు వాళ్ళకు డబ్బు విషయం ఏమైనా చెప్పావా ?" అడిగాను.

"లేదు సార్." సుబ్బరాజు అడ్డంగా తల వూపాడు.

"ఊఁ.... వాళ్ళతో ఆ విషయం ఏం మాట్టాడకు. పది నిమిషాల్లో వచ్చేస్తాను. మన దగ్గర డెక్స్ట్రోజ్ వుంది కదా !"

తలూపాడు.

"నే వచ్చేలోగా సెలైన్ స్టార్ట్ చెయ్!"

సుబ్బరాజు వెనక్కితిరిగి వస్తున్న నా వంక కొత్తగా, ఆశ్చర్యంగా చూస్తుంటాడని నాకు తెలుసు.